సాక్షి ప్రకాశం
గురువారం । 21 । ఆగస్టు । 2025



పశ్చిమానికి వైరల్ ఫీవర్
జిల్లాలోని పశ్చిమ ప్రకాశం వాసులు జ్వరాలతో మంచం పడుతున్నారు. వైరల్ ఫీవర్‌లు వేగంగా వ్యాపిస్తున్నాయి. - 8లో..



సాగర్ నీరు విడుదల చేయాలి
నాగార్జున సాగర్ కాలువల ద్వారా రైతులకు సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 34/26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

26 లోపు దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఒంగోలు సిటీ: ఒంగోలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలికలు)లో 2025–26 సంవత్సరానికి మూడో విడత ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఐటీఐ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రింట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 27వ తేదీ కళాశాలలో సర్టిఫికెట్ ధ్రువీకరణకు హాజరు కావాలని కోరారు. 29వ తేదీ నుంచి కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరై అడ్మిషన్ పొందవచ్చన్నారు. అడ్మిషన్ సమయంలో అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లను కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు 96030 41678, 89777 11292 నంబర్లను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు ప్రిమెట్రిక్ నేషనల్ స్కాలర్‌షిప్‌లు

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగ విద్యార్థులకు ప్రిమెట్రిక్ నేషనల్ స్కాలర్ షిప్‌లు కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రకాశం, బాపట్ల జిల్లాల సహాయ సంచాలకులు సువార్త బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాలకు ఆగస్టు 31వ తేదీలోపు, కేంద్ర వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డీఎస్సీ–2025 కు సంబంధించి వివిధ కేటగిరీలో 629 పోస్టులకు సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల మొబైల్‌కు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని మెసేజ్ వస్తుందని డీఈఓ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు చెరువుకొమ్ముపాలెంలోని సరస్వతి జూనియర్ కళాశాలలో హాజరు కావాలని కోరారు. మెసేజ్ వచ్చిన అభ్యర్థులు మూడు సెట్ల అటెస్టెడ్ అన్నీ సర్టిఫికెట్ కాపీలతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్ కు హాజరైనప్పుడు ఒరిజినల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేట్, బీఎడ్, డీఎడ్, బీపీఎడ్, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌లతో పాటు క్యాస్ట్‌సర్టిఫికెట్, డిసేబుల్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం తీసుకొని రావాల్సిందిగా డీఈఓ కోరారు.

'టంగుటూరుకు అడిగితే కందుకూరుకు టిక్కెట్ ఇచ్చారు'

టంగుటూరు: ఉచిత బస్సు పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం టార్గెట్ కోసం ఆర్టీసీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. బుధవారం కొంత మంది మహిళలు యర్రజర్ల నుంచి ఒంగోలుకు ఆర్టీసీ బస్సులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు టంగుటూరుకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. అయితే బస్సు కండక్టర్ టంగుటూరుకు కాకుండా కందుకూరుకు టిక్కెట్ ఇచ్చాడు. అదేంటని అడిగితే మీకు ఏదైనా ఉచితమే కదా అని సమాధానమిచ్చాడు. ప్రభుత్వం ఎక్కువ రాయితీ ఇచ్చిందని తెలియజేయడానికే ఆర్టీసీ అధికారులు ఇలా చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు.


22 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు టౌన్: పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలించనున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిట్ అధికారి సర్టిఫై చేసిన మూడు సెట్ల కాపీలు, ఇటీవల తీయించిన 6 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

సంపద కిక్కు!

ప్రభుత్వం 14 గంటలు మద్యం విక్రయిస్తుంటే..కూటమి నాయకులు 24 గంటలూ మద్యం అమ్మకాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పాలసీతో మద్యం ఏరులై పారుతోంది. ఇప్పటికే ప్రతి వీధిలోనూ బెల్టుషాపులు..అది చాలదన్నట్టు ప్రతీ మద్యం దుకాణానికి పర్మిట్ రూములు, 14 గంటలు బార్లు బార్ల తెరిచేలా ప్రభుత్వ నిర్ణయించడంపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనా సంపద సృష్టి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

- పీకలదాకా తాగించడమే ప్రభుత్వ లక్ష్యం
- నూతన పాలసీతో విచ్చలవిడి అమ్మకాలు
- రోజుకు 14 గంటల బార్ పనివేళలు
- బెల్టుషాపుల ద్వారా 24 గంటలూ విక్రయాలు
- జిల్లాలో 29 బార్లకు నోటిఫికేషన్ విడుదల
- ఇప్పటికే 189 మద్యం దుకాణాలు
- రోజుకు రూ.3 నుంచి రూ.6 కోట్ల మద్యం విక్రయాలు
- రూ.10 కోట్ల ఆదాయమే లక్ష్యంగా బార్లు, పర్మిట్ రూంలకు అనుమతి
- కూటమి పాలనలో 16 శాతం పెరిగిన విక్రయాలు
- జీవితాలు గుల్లయిపోతున్నాయంటూ కన్నీరు పెట్టుకుంటున్న మహిళలు
- ఇదేనా సంపద సృష్టి అంటూ ప్రజా సంఘాల ధ్వజం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో అధికారికంగా 189 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం లైసెన్సు మంజూరు చేసిన దుకాణాలకు అదనంగా ఒక్కో దుకాణానికి అనుబంధంగా పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు పుట్టుకొచ్చాయి. జిల్లాలోని 729 పంచాయతీల్లోని 1823 గ్రామాలుండగా ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. అక్రమంగా కోట్లాది రూపాయలు జేబులో వేసుకుంటున్నా కూటమి పాలకుల కడుపు నిండడం లేదు. దాంతో మరింతగా అమ్మకాలు పెంచుకునేందుకు పర్మిట్ రూంలు, బార్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజల జేబులు ఖాళీ చేయడం ద్వారా సంపద సృష్టించేందుకు శ్రీకారం చుట్టింది.

29 బార్లకు నోటిఫికేషన్

జిల్లాలో 29 బార్లకు కూటమి ప్రభుత్వం రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. 26 బార్లు ఓపెన్ కేటగిరీలోకి వస్తాయి. మిగిలిన మూడు బార్లు గీత కార్మికులకు కేటాయించింది. ఇందులో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో 16 బార్లు ఏర్పాటు చేయనుంది. మార్కాపురం పరిధిలో 5, చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరు పరిధిలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో 24 మద్యం దుకాణాలున్నాయి. ఈ 16 బార్లతో కలుపుకుంటే 40 దుకాణాలు మందుబాబులకు అందుబాటులో ఉంటాయి. ఇక మందుబాబులకు తాగినోడికి తాగినంత మద్యం దొరుకుంది.

రోజుకు రూ.3 కోట్ల మద్యం విక్రయాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విడతల వారీగా మద్య నిషేధం చేయాలని భావించి ప్రభుత్వం ద్వారా మద్యం విక్రయాలు ప్రారంభించారు. అందుకు భిన్నంగా కూటమి పాలకులు ప్రజల చేత మద్యం తాగించడమే పనిగా పెట్టుకున్నారు. దాంతో ఏడాది కాలంలోనే జిల్లాలో 12 నుంచి 16 శాతం మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. రోజుకు రూ.3 కోట్లకు పైగానే మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. పండుగలు, ఆదివారం సెలవులు, జాతరలు, తిరునాళ్ల జరిగే సమయంలో ఏకంగా రూ.6 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సరాసరిన నెలకు రూ.100 నుంచి రూ.120 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం.

మరింత ఆదాయమే లక్ష్యంగా ముందుకు

నెలకు రూ.120 కోట్ల వరకు విక్రయాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఈ ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు పలు మార్గాలను అన్వేషిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బార్లు, పర్మిట్ రూంలకు అనుమతివ్వాలని నిర్ణయించింది. ఇందుకుగాను తాజాగా 29 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో బార్‌కు అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించింది. ప్రాసెసింగ్ ఫీజు మరో రూ.10 వేలు కలిపి రూ.5.10 లక్షల చలానా కట్టాల్సి వస్తుంది. ఇది నాన్ రిఫండబుల్ ఫీజు. లైసెన్స్ ఫీజును రెండు శ్లాబులుగా విభజించారు. 50 వేల లోపు జనాభా కలిగిన ప్రాంతాలకు రూ.35 లక్షలు, 50 వేల జనాభా దాటిన ప్రాంతాలకు రూ.55 లక్షలుగా నిర్ణయించారు. జిల్లాలో 21 బార్లు రూ.55 లక్షల పరిధిలో ఉండగా మిగిలిన 8 బార్లు రూ.35 లక్షల పరిధిలో ఉన్నాయి. గీత కార్మికులకు కేటాయించిన 3 బార్లకు 50 శాతం రాయితీ. ఈ ఫీజును 6 విడతలుగా చెల్లించే వెసులుబాటు ఉంది. ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని, లేని పక్షంలో ఆయా బార్ల పరిధిలో మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 29 బార్లకు గాను అప్లికేషన్ల రూపంలోనే సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ఫీజుల రూపంలో రూ.14.35 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇదంతా ప్రజల జేబుల నుంచే వసూలు చేస్తున్నారన్న సంగతిని మరిచిపోకూడదని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

మందే మందు...

నిన్నా మొన్నటి వరకు రోజుకు 12 గంటల పాటు మద్యం విక్రయాలు చేసేలా నిబంధనలు విధించారు. ఇప్పుడు తాజాగా అదనంగా మరో 2 గంటల పాటు మద్యం విక్రయించేందుకు అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లలో మద్యం విక్రయించేందుకు అనుమతించడంపై మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పొద్దస్తమానం కూలి పనులు చేసి సంపాదించిన సొమ్మంతా తాగుడుకే తగలబెడుతున్నారని మహిళలు కన్నీరు పెట్టుకుంటున్నారు. మరికొందరు మగాళ్లు మద్యం కోసం భార్యాబిడ్డలను వేధిస్తున్నారని, ఇంట్లోని వస్తువులను తీసుకెళ్లి తెగనమ్ముకుంటూ పీకలదాకా తాగుతున్నారని వాపోతున్నారు. శ్రామిక ప్రజల సంపాదనను మద్యం పేరుతో దోచుకుంటున్న పాలకులు సంపద సృష్టిస్తున్నామని గొప్పలు చెబుతుండడం సిగ్గుచేటని ప్రజా సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

మహిళలపై పెరిగిపోయిన హింస



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల మీద అన్నీ రకాల హింస పెరిగింది. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెచ్చుమీరిపోయాయి. మందుబాబుల ఆగడాలతో మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. దీనితోపాటుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్యులు అల్లాడి పోతున్నారు. చేయడానికి పనులు లేక యువకులు ఆవేదనకు గురవుతున్నారు. అర్ధరాత్రి వరకూ బార్లకు అనుమతులు, పర్మిట్ రూంలకు అనుమతివ్వడం చాలా దారుణం. ఆదాయం గురించి తప్ప ప్రజారోగ్యం గురించి పాలకులు పట్టించుకోకపోవడం విచారకరం.

– మర్రి విజయ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

నిరుపేద కుటుంబాలను రోడ్డున పడేస్తున్న మద్యం



ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం పాలసీ వలన మద్యం తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీంతో గ్రామీణ ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోని శ్రామికుల జీవితాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బులతో మద్యం తాగుతున్న కొందరు వ్యక్తులు కుటుంబ పోషణను పట్టించుకోవడం లేదు. దాంతో భార్యా బిడ్డలు పస్తులుండాల్సి వస్తోంది. పిల్లల ఆకలి బాధలు చూడలేక కొందరు మహిళలు కూలి పనులకు వెళుతున్నారు. మద్యం విక్రయాలను తగ్గించడమే కాకుండా పూర్తిగా మద్య నిషేధం విధించడానికి కృషి చేయాలి.

– కంకణాల రమాదేవి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధి పనుల్లో భారీ అవినీతి

- సంతకాలు పెట్టుకుని డబ్బులు డ్రా చేశారు
- పనుల కొలతల్లో భారీ తేడాలు
- గ్రామాల్లో రైతులకు తెలియకుండా పనులు చేసినట్లు బిల్లులు
- టీఏలు, ఎఫ్ఏల అవినీతిపై పీడీ మండిపాటు


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

దర్శి: ''ఇలాంటి పనులు చేయడానికి మీకు సిగ్గుండాలి..ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయండి..ఇంత అవినీతి పనులకు డబ్బులు ఎలా చెల్లించారు..ఒక్కటంటే ఒక్క పనీ సక్రమంగా లేదు..మిమ్మల్ని ఏం చేయాలో మాకే అర్థం కావడం లేదు. కొలతల్లో మరీ ఇంత తేడాలా..అన్నీ కొలతలు తేడాలే..పనులు చేయకుండా కాలువలు నీరొచ్చి పూడి పోయాయని ఎలా చెప్తారు. మీరు పనులు చేసినప్పుడు కనీసం ఫొటోలు అయినా ఉండాలి గా..? మీరు చేసిన పనికి రాసిన రాతలకు పొంతన లేదు...పని చేసినట్లు ఫొటోల ఆధారాలూ లేవు..తప్పుడు లెక్కలు వేసి బిల్లులు చేశారు'' అంటూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పీడీ గంగవరపు జోసఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో చేసిన రూ.12,14,47,188 ల పనులు, పంచాయతీ రాజ్, ఇతర శాఖల ద్వారా చేసిన రూ.7,06,95,482లు కలిపి మొత్తం రూ.19,21,42,670 విలువైన పనులపై సామాజిక తనిఖీ నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు భారీ అవినీతికి పాల్పడినట్లు వెల్లడైంది. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించారు. ఆ స్థానంలో కూటమి నేతలను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించారు. అధికారం మాది..ఇక మమ్మల్ని అడిగేదెవరకున్నారేమో కానీ ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు చేతివాటం ప్రదర్శించారు. సామాజిక తనిఖీల్లో వారి అవినీతి బట్టబయలైంది. సామాజిక తనిఖీ అధికారులు డోర్ టూ డోర్ ఎంక్వయిరీ చేసి వారి అవినీతిని తూర్పారబట్టారు. జాబ్ కార్డులు అప్‌డేట్ లు చేయలేదు. పని ప్రదేశాల్లో టెంట్‌లు, మెడికల్ కిట్‌లు, వంటి సౌకర్యాలు కల్పించలేదు. అన్నీ కల్పించినట్లు రాసుకుని బిల్లులు చేసుకున్నారు. పనుల కొలతలు, రోడ్డు పనులు తనిఖీలు చేసిన నివేదికను ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఉపాధి పనులు చేసిన చోట పనికి ముందు ఫొటోలు, పని తరువాత ఫొటోలు తీసి పెట్టలేదని పనులు చేసేటప్పుడు మాత్రమే ఫొటోలు పెట్టారని చెప్పారు. పనులు వద్ద వర్క్ బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రతి పనిలో 10 నుంచి 36 శాతం వరకు కొలతలు తేడాలు ఉన్న పనులు అధికంగా ఉన్నాయి. అధిక మొత్తంలో పనులు చేసినట్లు నమోదు చేసి డబ్బులు డ్రాచేశారు. చేసిన పనుల కొలతలు పెంచి బిల్లులు చేశారు. గ్రావెల్ రోడ్లకు లోకల్ గ్రావెల్ తోలి పనులు నాసిరకంగా చేశారు. మస్టర్‌లకు సంతకాలు, వేలు ముద్రలు లేకుండా పేమెంట్లు చేసినట్లు రాసుకున్నారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్‌లకు పనులు కల్పించి పేమెంట్‌లు చేశారు. రైతులకు తెలియకుండా వారు పనులు చేసినట్లుగా మస్టర్‌లు వేసి వారి ఖాతాల్లో పనులు చేయకుండానే డబ్బులు వేసి ఆ డబ్బులు వసూలు చేసుకున్నారు. పనికి వెళ్లకుండా పేమెంట్‌లు వేసి ఆ తరువాత వారికి తెలియజేసి వారి వద్ద డబ్బులు తీసేసుకున్న ఎన్నో సంఘటనలు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వేలో వెల్లడైంది. కొన్ని పుస్తకాల్లో పనులు చేసిన వారి సంతకాలు లేకుండా అన్నీ ఒకే వేలిముద్రలు వేసినట్లు గుర్తించారు. ఈ పనులపై టీఏ, ఎఫ్ఏలను ప్రశ్నించగా కొందరు రైతులు దున్నుకున్నారని, మరి కొన్ని వర్షాలకు కొట్టుకు పోయాయని పొంతన లేని సమాధానం ఇచ్చారు. పనులు చేసినప్పుడు ఫొటోలు ఇవ్వండని అడగ్గా మౌనమే సమాధానమైంది. సాయంత్రం వరకు 6 పంచాయతీలకు చెందిన వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ ప్రోగ్రాం అధికారి పీ ఈశ్వరరావు, ఎస్ఆర్పీ నాగరాజు, ఏపీడీ సుబ్బారావు, డీఆర్పీ నాగరాజు ఎంపీపీ సుధారాణి, ఎంపీడీఓ వసంతరావునాయక్ పాల్గొన్నారు.

చలం రచనలు ఆదర్శనీయం


చలం రచనలపై చర్చలో పాల్గొన్న సాహితీ వేత్తలు

ఒంగోలు టౌన్: సమాజంలో మహిళ గురించి మాట్లాడటానికి భయపడే రోజుల్లోనే వందేళ్ల క్రితమే మహిళలకు పురుషులతో సమానత్వ హోదా కల్పించాలని చలం చర్చించాడని ప్రభవ వ్యవస్థాపకురాలు చంద్రలత చెప్పారు. పీవీఆర్ ఉన్నతపాఠశాల ఆవరణలో జరుగుతున్న పుస్తక మహోత్సవం 6వ రోజు మాదాల రంగారావు సాహిత్య వేదికలో బుధవారం చలం రచించిన 'స్త్రీ' శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీకి శరీరం ఉంది దానికి వ్యాయామం ఇవ్వండి, ఆమెకు మెదడు ఉంది దానికి జ్ఞానం ఇవ్వండి, ఆమెకు హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వండని చలం చెప్పిన మాటలను గుర్తు చేశారు. అప్పటి సంప్రదాయాలకు వ్యతిరేకంగా స్త్రీ స్వేచ్ఛ గురించి పరదాలను తెగతెంపులు చేశారని చెప్పారు. ఆనాడు చలం చర్చించిన విషయాలు నేటికీ సజీవంగా ఉన్నాయని, భావితరాలు చలాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. నరసం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ చలం రచనలు ఒక విప్లవాన్ని తీసుకొచ్చాయని చెప్పారు. రచయిత కాట్రగడ్డ దయానంద్ చలం రచనల గురించి విశ్లేషించారు. కార్యక్రమాన్ని వల్లూరు శివ ప్రసాద్ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు చిన్నారుల కోసం నిర్వహించిన కథల పోటీలో 80 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


వనరులను సమర్థంగా వినియోగించుకోండి

- మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షలో కలెక్టర్

ఒంగోలు సబర్బన్: అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై మున్సిపాలిటీలు దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఒంగోలుతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా కార్యాలయంలో ఉన్న పారిశుధ్య కార్మికుల వివరాలు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైనేజీలను శుభ్రం చేయటం, తాగునీటి సరఫరాపై ప్రధానంగా ఆమె సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆయా విషయాల్లో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనరు కె. వెంకటేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీలను శుభ్రం చేయటానికి నగరంలో 15 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. అన్న క్యాంటీన్లలో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కీలకమని కమిషనర్లకు చెప్పారు. వీధి కుక్కలను కట్టడి చేయటం, వాటికి వ్యాక్సిన్ వేయించడం పైనా దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు చెప్పారు. జంతు ప్రేమికుల సహకారం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్లతో పాటు పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా పాల్గొన్నారు.

కోతలు లేకుండా విద్యుత్ అందించాలి

ఒంగోలు సబర్బన్: కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల పట్ల సిబ్బంది ప్రవర్తన బాగుండాలని, సంస్థకు చెడ్డ పేరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లును ఆదేశించారు. వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ డిమాండు–సరఫరా, పీఎం సూర్యఘర్, ఆర్.డి.ఎస్.ఎస్ పనులు, స్మార్ట్ మీటర్లు, నూతన సబ్ స్టేషన్ల నిర్మాణ పనుల్లో పురోగతి, సిబ్బంది- ఖాళీలు, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం, ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్, తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. ఆయా అంశాలపై ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు కలెక్టరుకు వివరించారు. ఖాళీగా ఉన్న ఏఈఈ పోస్టులను భర్తీ చేయటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పనిచేసే ప్రాంతంలోనే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఐవీఆర్ఎస్ సర్వేలో విద్యుత్తుశాఖ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాలన్నారు. దోర్నాల, మార్కాపురం, ముండ్లమూరు, చీమకుర్తి, పెద్దారవీడు, యర్రగొండపాలెం, సంతనూతలపాడు, పామూరు, మద్దిపాడు మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆర్‌డీఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు కొత్తగా వేస్తున్న 3–ఫేస్ విద్యుత్ లైన్ల పనులు కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈలు, డీఈఈలు, నెడ్ క్యాప్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

9 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి


పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లతో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న 9 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ పదోన్నతి అనేది మరింత బాధ్యత పెంచుతుందని చెప్పారు. ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లు మరింత నిబద్ధతగా విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని కోరారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని, మాదక ద్రవ్యాలు, గంజాయి సేవనం వలన కలిగే అనర్థాలను వివరించి చెప్పాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఏఎస్సైగా పదోన్నతి పొందిన వారిలో సుభాన్ సాహెబ్ (బాపట్ల జిల్లా), కె.మురళీధర్ (నెల్లూరు జిల్లా), ఎస్ఆర్ ఖాశీం షరీఫ్ (తాళ్లూరు పీఎస్), షేక్ జిల్లా సాహెబ్ (బాపట్ల జిల్లా), ఐవీ శ్రీనివాసరావు (మార్కాపురం రూరల్), షేక్ బాజి బాబు (త్రిపురాంతకం పీఎస్), ఎస్కే ప్రవీణ్ షా (డీసీఆర్బీ ఒంగోలు), సీహెచ్ హెప్సీ రాణి (డీసీఆర్బీ ఒంగోలు), వి.కోటేశ్వరరావు (బాపట్ల జిల్లా) ఉన్నారు.

క్లుప్తంగా

పులి జాడ కోసం గాలింపు



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

కంభం: చిరుతపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని డీఆర్వో ఆనంద రావు సూచించారు. కంభం మండలంలోని నడింపల్లి, ఔరంగబాద్ గ్రామాల సమీపంలోని ఏనుగు కొండ పరిసరాల్లో ఉన్న పంట పొలాల్లో చిరుత పాదముద్రలను రైతులు గుర్తించిన విషయం తెలిసిందే. పులి సంచరిస్తోందని తెలియడంతో అప్రమత్తమైన ఫారెస్టు అధికారులు పాదముద్రలు ఉన్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. కొండ పరిసర ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. వర్షం పడటం వల్ల పులి పాదముద్రలు స్పష్టంగా లేవని, ఆచూకీ కోసం గాలిస్తున్నామని డీఆర్వో తెలిపారు.

7 గ్రానైట్ వాహనాలు సీజ్



సీజ్ చేసిన గ్రానైట్ వాహనాలు

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండల పరిధిలోని రామతీర్థం ప్రాంతంలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు బుధవారం వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనింగ్ బిల్లులు లేకుండా గ్రానైట్ ముడిరాళ్లను తరలిస్తున్న ఏడు వాహనాలను సీజ్ చేశారు. గ్రానైట్ బ్లాకులు తరలిస్తున్న మూడు లారీలు, ఫినిషింగ్ మెటీరియల్ తరలిస్తున్న 2 లారీలు, కంకర ముడిరాయి తరలిస్తున్న 2 లారీలను సీజ్ చేసి ఏపీఎండీసీ ప్రాంగణానికి తరలించారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం

- 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచన

ఒంగోలు సిటీ: స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికన అంతర్ జిల్లా బదిలీలకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు లీప్ యాప్‌లో ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తు ఫారాన్ని సంబంధిత మండల విద్యాశాఖాధికారికి గురువారం నుంచి 24వ తేదీలోగా అందజేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీల్లో పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయంలో వెరిఫికేషన్ అనంతరం తుది జాబితాను 30వ తేదీన ప్రభుత్వానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పైన పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం అర్హులైన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పామూరులో చోరీ

పామూరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం మండల కేంద్రమైన పామూరులోని తూర్పు వీధిలో వెలుగుచూసింది. వివరాలు.. తూర్పు వీధికి చెందిన బోగ్యం పేరమ్మ తమ బంధువైన యాటా ప్రసన్న ఇంటికి మంగళవారం రాత్రి వెళ్లింది. బుధవారం ఉదయం ఆమె తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి బయట తాళం పగలగొట్టి ఉంది. బీరువా తాళం పగలగొట్టి 4 గ్రాముల బంగారు కమ్మలు, రూ.10 వేల నగదు చోరీకి గురయ్యాయని పేరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కనిగిరిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరానికి చెందిన యు రమణారెడ్డి (44) మంగళవారం రాత్రి బైక్‌పై ప్రధాన రహదారి దాటుతూ బైక్ జారడంతో కింద పడ్డాడు. ఈ క్రమంలో తన ఇంటి ముందు ఉన్న కాలువ రాయిని గుద్దుకుని రమణారెడ్డికి బలమైన దెబ్బలు తగలి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చార్జి ఇవ్వని కార్యదర్శి

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి కార్యదర్శి నెల రోజుల క్రితం వారం రోజుల పాటు విధులకు గైర్హాజరవడంతో ఎంపీడీఓ వి.జ్యోతి అతనిపై చర్యలకు డీపీఓకు రిపోర్టు పంపారు. సదరు కార్యదర్శి తన ఇష్టానుసారంగా తిరుగుతూ అవసరమైన రోజు కార్యాలయానికి వెళ్లి పనులు చేసుకుంటున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు. గుండ్లాపల్లి గ్రామానికి ఇన్‌చార్జిగా పక్క గ్రామానికి చెందిన కార్యదర్శిని నియమించినప్పటికీ చార్జి అప్పగించకపోవడంతో గ్రామంలో జరగాల్సిన పనులు కుంటుబడుతున్నాయని అంటున్నారు. దీనిపై డీపీఓ వెంటనే చర్యలు తీసుకోవాలని, తద్వారా గ్రామంలో ఇబ్బందులు తొలగించేందుకు కొత్త కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.

పశ్చిమానికి వైరల్ ఫీవర్!

- మార్కాపురం జీజీహెచ్‌కు జ్వర బాధితుల క్యూ
- వందల సంఖ్యలో ప్రజలు అనారోగ్యంపాలు
- కిటకిటలాడుతున్న ప్రైవేట్ వైద్యశాలలు



మార్కాపురం జీజీహెచ్‌లో క్యూలైన్‌లో జ్వరపీడితులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం వాసులు జ్వరాలతో మంచం పడుతున్నారు. వైరల్ ఫీవర్ వేగంగా వ్యాపిస్తుండటంతో వందలాది మంది బాధితులు చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. మార్కాపురం జీజీహెచ్‌కు వస్తున్న జ్వర పీడితుల సంఖ్య చాంతాడులా పెరుగుతోంది. ప్రైవేట్ ఆస్పత్రులు సైతం జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాలతోపాటు డివిజన్ పరిధిలోని మండలాల నుంచి జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈనెల 1 నుంచి 19వ తేదీ వరకు 194 మంది జ్వర పీడితులు జీజీహెచ్‌లో చికిత్స పొందగా, ప్రస్తుతం 32 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. మార్కాపురం పట్టణంలోని సుమారు 20 ప్రైవేట్ వైద్యశాలలు రోగులతో నిండిపోతున్నాయి. పలువురు జ్వరపీడితులు నీరసంతో ఇబ్బంది పడుతూ సెలైన్ బాటిల్స్ పెట్టించుకుంటున్నారు. కాగా వైద్యశాలల్లో ల్యాబ్‌లన్నీ రక్త పరీక్షలకు వచ్చిన వారితో నిండిపోతున్నాయి.



చికిత్స పొందుతున్న పేషంట్లు

పారిశుధ్యం అధ్వానం

మార్కాపురం డివిజన్‌లోని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే అంతర్గత రోడ్లు బురదమయంగా మారడం, వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల ధాటికి తట్టుకోలేకపోతున్నామని, రోజూ ఫాగింగ్ చేయాలని పట్టణ ప్రాంతాలతోపాటు పల్లె వాసులు కోరుతున్నారు.

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం



జ్వర పీడితుల కోసం మార్కాపురం జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. చికిత్స అందిస్తున్నాం. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. కొద్దిగా జలుబు, ఒళ్లు నొప్పులు ఉన్నా వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలి. దోమలు కుట్టకుండా స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– రామచంద్రరావు,
జీజీహెచ్ సూపరింటెండెంట్

ప్రధాని మోదీ చౌకీదార్ కాదు చోర్

- ప్రజా రచయిత జయరాజ్



ఒంగోలు కళాఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ప్రజా రచయిత జయరాజ్

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను తాను చౌకీదార్ అని చెప్పుకుంటున్నారని, నిజానికి ఆయన దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న చోర్ అని ప్రజా రచయిత జయరాజ్ విరుచుకుపడ్డారు. సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూంలో బుధవారం నిర్వహించిన ఒంగోలు కళాఉత్సవాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనలో సాధించిందేమీ లేదన్నారు. బీజేపీ పాలనలో దేశం వందేళ్లు వెనక్కి పోయిందన్నారు. మాటరాని వాడి గొంతుకగా ప్రజలను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న కృషిని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి మాదాల రంగారావు, వందేమాతరం శ్రీనివాస్, బాబ్జీ, అజయ్ ఘోష్ వంటి కళాకారులను అందించిన ఘనత ప్రజా నాట్యమండలికి దక్కుతుందని చెప్పారు. ప్రజల హక్కుల కోసం, కార్మిక చట్టాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు అహర్నిశలు పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు, ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటంలో కళాకారులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడేదే కళలని, ప్రజా నాట్యమండలి ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తుందన్నారు. నెల 23, 24 తేదీల్లో ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్ అధ్యక్షత వహించగా కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా కళాకారులు ఉమక్క, సామ్యేల్, దేవరాజ్, ప్రేమానందం, బొల్లుముంత కృష్ణ, జయరావులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సాగర్ నీరు వెంటనే విడుదల చేయాలి



నడిగడ్డలో ఎమ్మెల్యేకి సమస్యలు విన్నవిస్తున్న రైతులు, నాయకులు

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ కాలువల ద్వారా రైతులకు సాగు నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. త్రిపురాంతకం మండలం నడిగడ్డకు వచ్చిన ఆయనను కలిసిన రైతాంగం సమస్యలు ఏకరువు పెట్టారు. సాగర్ జలాశయంలో నిండుగా నీరున్నా రైతాంగానికి సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నీరు సమృద్ధిగా ఉన్న ప్రజలకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతూ సముద్రానికి తరలిపోతున్నా సాగర్ ఆయకట్టుదారులు నారు వేసుకోలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇకనైనా రైతుల గురించి ఆలోచించాలన్నారు. ఇదే విధంగా కొనసాగితే సకాలంలో పంటలు వేసుకోలేరని చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని, వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించి వారికి పంట రుణాలు అందించి ఖరీఫ్ పంటలకు అన్ని విధాలా సహకరించాలని అధికారులను, బ్యాంకర్లను చంద్రశేఖర్ కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, గాలెంయ్య, రమణారెడ్డి, నారాయణరెడ్డి, మురారి గాలెయ్య తదితరులు ఉన్నారు.

భర్త ఆచూకీ లేదు.. అత్తమామలు వేధిస్తున్నారు

- భర్త ఇంటికి వెళ్తే రూ.10 లక్షలు తెమ్మంటున్నారు
- పొదిలి పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ యువతి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అనూష

పొదిలి: టీ తాగి వస్తానని చెప్పి మార్గమధ్యంలో వదిలేసి వెళ్లిన భర్త ఆచూకీ కోసం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా మాదాపూర్ గ్రామానికి చెందిన యువతి బుధవారం పొదిలి పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పోతవరానికి చెందిన బత్తుల కార్తీక్ బేల్దారీ పనుల కోసం తెలంగాణ వెళ్లాడు. పని ప్రదేశంలో మాదాపూర్‌కు చెందిన అనూష అనే యువతి పరిచయమైంది. కుటుంబ సభ్యులను ఎదిరించి ఇద్దరూ వివాహం చేసుకున్నారు. భార్యభర్తలు ఇద్దరూ తెలంగాణాలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తొలి రోజుల్లో బాగానే ఉన్నప్పటికీ రోజులు గడిచేకొద్దీ వారి మధ్య మనస్పర్థలు పొడచూపాయి. ఇటీవల దర్శిలో జరిగిన బంధువుల వివాహానికి భార్యాభర్తలు హాజరయ్యారు. ఈ సమయంలో అనూషను వదిలించుకుంటే మంచి సంబంధం చూసి వివాహం చేస్తామని కార్తీక్‌కు తల్లిదండ్రులు నచ్చజెప్పినట్లు సమాచారం. అనూషను వదిలించుకోవాలని నిర్ణయించుకున్న కార్తీక్.. ఆమెతో కలిసి తెలంగాణ పయనమయ్యాడు. ఆర్మూరులో ఆగిన సమయంలో తాను టీ తాగి వస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంత సమయం వేచి చూసినా భర్త తిరిగిరాలేదు. ఫోన్ కూడా స్విచాఫ్ రావడంతో అనుమానించిన ఆమె తన భర్తను వెతుక్కుంటూ పోతవరం చేరింది. అక్కడ ఇంటికి తాళం వేసి ఉండటంతో అత్తామామలకు ఫోన్ చేసింది. రూ.10 లక్షలు కట్నం ఇస్తేనే ఇంటికి రావాలని అటువైపు నుంచి సమాధానం రావడంతో విస్తుపోయింది. దిక్కుతోచని పరిస్థితుల్లో పొదిలి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన తతంగంపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. తాను గర్భవతినని, భర్త ఆచూకీ తెలుసుకుని న్యాయం చేయాలని ఆ యువతి పోలీసులను కోరింది.

మహిళల సమస్యలపై ఐక్య ఉద్యమాలు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్కే మస్తాన్‌బి

కొండపి: మహిళలు సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని ఐద్వా జిల్లా మహాసభలు తీర్మానించాయి. ఐద్వా జిల్లా మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్కే మస్తాన్‌బి మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, ఆకృత్యాలు పెరిగేందుకు కారణమైన మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. ఏడాది కాలంలో 35 వేల మందిపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరకడమే నేరాలు పెరిగిపోవడానికి కారణమన్నారు. ఆకృత్యాలకు పాల్పడిన దోషులపై సకాలంలో విచారణ చేసి శిక్షలు వేయకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నాయన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్య కులం, మతం పేరుతో, ప్రాంతీయ తత్వాల పేరుతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నాయని, వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే మహిళలకు సంపూర్ణ రక్షణ ఉందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న మహిళలకు పాలకులు ప్రాధాన్యం ఇవ్వకుండా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ మూడేళ్ల ఉద్యమ సమీక్ష, భవిష్యత్ కర్తవ్యాల నివేదికపై మండలాల వారీగా చర్చలు చేసి కార్యదర్శి నివేదికను తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. పీడీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కల్పన, వీరాస్వామి, కేజీ మస్తాన్, కొండయ్య, సుజాత, సూరిబాబు, రూబెన్, బాబురావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి



జలవనరుల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: నీటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనుల్లో నాణ్యత ముఖ్యమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులతో బుధవారం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ నీటి కాలువల్లో జరుగుతున్న ఈ పనుల్లో పురోగతిపై ఆమె సమీక్షించారు. నాగార్జునసాగర్, రామతీర్థం, మోపాడు, కంభం చెరువుల నుంచి నీళ్లు సరఫరా అయ్యే కాలువల్లో చేపట్టిన పనుల పురోగతిని ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. ఎస్‌డీఎంఎఫ్ పనులను టెండర్ల ద్వారా చేపట్టామన్నారు. రూ.10 లక్షల లోపు విలువైన పనులైతే ఆయా సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత కూడా అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. ఈ దిశగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువులను కూడా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. భూగర్భ నీటిమట్టం పెంచేందుకు ఆయా ప్రాంతాలను బట్టి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలను కూడా రూపొందించాలని చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈలు, భూగర్భ నీటివనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

35 బాటిళ్ల గోవా మద్యం స్వాధీనం



గోవా మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కంభం: కంభంలోని ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. స్థానిక నెహ్రూనగర్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పోతురాజుటూరు గ్రామానికి చెందిన కవలకుంట్ల నరేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద 35 గోవా మద్యం ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

53 మద్యం బాటిళ్లు ధ్వంసం

హనుమంతునిపాడు: స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం 53 మద్యం బాటిళ్లు పగులగొట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాధవరావు మాట్లాడుతూ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీవీ వెంకట్ పర్యవేక్షణలో గతంలో నమోదైన వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం 53 క్వార్టర్ బాటిళ్ల మద్యం, 3.5 లీటర్లు దేశీయ సారాయి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు.

రైల్వే డీఆర్ఎం విస్తృత తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా బుధవారం గూడూరు–విజయవాడ సెక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నెల్లూరు స్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో జరుగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ముందుగా అధికారులతో కలిసి డీఆర్ఎం గూడూరు స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తూ సకాలంలో పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అక్కడ నుంచి నెల్లూరు స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. నూతన భవన నిర్మాణాలు, ప్లాట్‌ఫాం పనులను పర్యవేక్షించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రత్యేక ప్రవేశ ద్వారాలు నెల్లూరు స్టేషన్‌కు ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం బిట్రగుంట, సింగరాయకొండ, ఒంగోలు స్టేషన్‌లను సందర్శించి సిబ్బందికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో గూడూరు–విజయవాడ సెక్షన్ అత్యంత కీలకమైనదన్నారు. ఈ సెక్షన్‌లో ప్రపంచ స్థాయి ఆధునిక సౌకర్యాల దిశగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో పనులు వేగంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఒంగోలు జైలుకు అరుణ



కారులో ఒంగోలు జిల్లా జైలుకు తరలిస్తున్న అరుణ

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో అతడి సన్నిహితురాలు అరుణను నెల్లూరు పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఆమెను మేదరమెట్ల వద్ద నెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. కావలి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నెల్లూరు పోలీసులు ఆమెను రాత్రి 10 గంటలకు ఒంగోలు జిల్లా జైలుకు తరలించారు.

బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలి

- జిల్లాలో 10 వేల హెక్టార్లలో సాగు లక్ష్యం
- ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు



సీహెచ్.శ్రీనివాసులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 2025–26లో 10 వేల హెక్టార్లలో నూతనంగా డ్రిప్, స్ప్రింక్లర్ల ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. భాగ్యనగర్‌లోని కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలో బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఏపీఎంఐపీ ఎంఐఏఓపీలు, హార్టికల్చర్ అధికారులు, వీహెచ్ఏల ద్వారా రైతులను గుర్తించామన్నారు. స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా 8,915 రైతులకు 11,221.91 హెక్టార్లకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. అందులో 1,118 రైతులకు సంబంధించి 1,433.02 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లకు కలెక్టర్ ద్వారా పరిపాలన ఆమోదం తీసుకున్నామన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గత ఏడాది పంటలకు ధరలు ఆశించిన మేరకు రాకపోవడంతో మిరప, పొగాకు, బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మే మొదటి వారం నుంచి ప్రత్యామ్నాయ పంటలుగా పత్తి, మొక్కజొన్న, కంది, బొప్పాయి, నిమ్మ, బత్తాయి, మామిడి, కూరగాయలు, పూలమొక్కలు, కరివేపాకు సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు వస్తున్నారని ఆయన వెల్లడించారు.

కలెక్టర్‌ను కలిసిన కందుకూరు సబ్ కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సబ్ కలెక్టర్ హిమవంశీ

ఒంగోలు సబర్బన్: జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశీ కలిశారు. ఇటీవలే కందుకూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కూడా ఆయన ఛాంబర్‌లో కలిశారు.